క్లుప్తంగా

తుపాను నష్టాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలి

ఏలూరు (టూటౌన్): తుపాను, కరువు నష్టాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించి రాష్ట్రానికి తక్షణ సాయంగా రూ.వెయ్యి కోట్లు మంజూరు చేయాలని రాజకీయపక్షాల, ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది. స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో సోమవారం వివిధ పార్టీలు, ప్రజా, కార్మిక, వ్యవసాయ సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అధ్యక్షతన నిర్వహించారు. తుపాను బాధితులను ఆదుకోవాలని కోరుతూ ఈ నెల 14న ఏలూరు జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామని కృష్ణ చైతన్య తెలిపారు. ఆయా సంఘాలు, పార్టీల నాయకులు కె.శ్రీనివాస్, రాయంకుల లక్ష్మణరావు, ఎస్ వెంకట్రావు, రాజనాల రామ్మోహనరావు, సీపీఐ (ఎంఎల్) బద్దా వెంకట్రావు, కె.రాజు, కె.నరేష్, కె.కృష్ణమాచార్యులు, జి.నాగేశ్వరరావు మాట్లాడారు.

కాలేజీకి 30 డెస్కుల అందజేత

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రూ.2.70 లక్షల విలువైన 30 డ్యూయల్ డెస్కులను తపన ఫౌండేషన్ ద్వారా సోమవారం అందజేశారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ జీఎస్ఆర్ చౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గుత్తా గిరిబాబు, సిబ్బంది ఆయన్ని సత్కరించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలోని కార్పొరేషన్, పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస డాంగే కోరారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 27 తర్వాత రాష్ట్ర వ్యాప్త సమ్మెకు మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ పిలుపు నిచ్చిందన్నారు. స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయం నందు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏలూరు యూనిట్ సమావేశం సోమవారం భజంత్రీ శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. నాయకులు బండి వెంకటేశ్వరరావు, పుప్పాల కన్నబాబు, ఎ.అప్పలరాజు, ఎలగాడ శివ కుమార్, దొడ్డిగర్ల నాగబాబు, మాడుగుల జగదీష్, బంగారు మధు, పేడారి వంశీ, గోవాడ మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ

దెందులూరు: గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ కళాశాల విద్యార్థులు ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించిన క్రీడా పోటీల్లో సత్తా చాటారని ప్రిన్సిపల్ ఎస్.నత్తానియేలు అన్నారు. సోమవారం ప్రతిభచూపిన క్రీడాకారులను కళాశాలలో అభినందించారు. వాలీబాల్‌లో జి.గౌతమి, టి.తులసి, పి.రమణి మూడో స్థానం సాధించారు. కబడ్డీలో ఎం.గుణవతి, డీ.భవాని ప్రథమస్థానం, ఖోఖోలో వెన్నెల, రాజేశ్వరి, గంగా భవాని ప్రథమ స్థానం, ఖోఖో బాలుర విభాగంలో సతీష్ మూడో స్థానం, టేబుల్ టెన్నిస్‌లో బాలుర విభాగంలో సందీప్, సురేంద్ర మొదటి స్థానం, వెయిట్ లిఫ్టింగ్‌లో బాలికలు రెండో స్థానం సాధించారని తెలిపారు.

పేదలకు అండగా సీఎం జగన్

ఉత్సాహంగా వై ఏపీ నీడ్స్ జగన్

ఏలూరు టౌన్: రాష్ట్రంలో నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేద ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారని ఏలూరు డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు అన్నారు. ఏలూరు నగరంలో సోమవారం పలు సచివాలయాల పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నేతలతో పాటు లబ్ధిదారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నాలుగున్నరేళ్ల కాలంలో తమకు సంక్షేమ పథకాలు అందించడం పట్ల లబ్ధిదారులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఏలూరు 25వ సచివాలయం పరిధిలో 35వ డివిజన్‌లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. తొలుత పార్టీ జెండాను ఆవిష్కరించారు. డివిజన్‌లో సంక్షేమ పథకాలకు సంబంధించిన వివరాలతో కూడిన బోర్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు కృషి చేస్తున్నారని చెప్పారు. పేదలకు పథకాలను నేరుగా అందిస్తూ దళారుల దందాలను నిరోధించారని చెప్పారు. ప్రతి మహిళకూ మేలు చేసేందుకు అనేక పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, క్లస్టర్-2 మహిళా అధ్యక్షురాలు గుడిదేశి లక్ష్మిశారద, పీటీ నాగేశ్వరరావు, కార్పొరేషన్ మేనేజర్ మూర్తి, గృహసారథులు, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు ఉన్నారు.



35వ డివిజన్‌లో సంక్షేమ బోర్డు ఆవిష్కరిస్తున్న డిప్యూటీ మేయర్లు శ్రీనివాస్, సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ చిరంజీవులు



52వ సచివాలయంలో సంక్షేమ బోర్డులు ఆవిష్కరిస్తున్న పార్టీ క్లస్టర్-1 అధ్యక్షుడు చంద్రశేఖర్, జేసీఎస్ కన్వీనర్ సదానందం

● ఏలూరు వన్‌టౌన్‌లోని 52వ సచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా జగనన్న మా నమ్మకం – వార్డుకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. క్లస్టర్-1 పార్టీ అధ్యక్షుడు సుంకర చంద్రశేఖర్, క్లస్టర్-1 జేసీఎస్ కన్వీనర్ మోటమర్రి సదానందం, మహిళా అధ్యక్షురాలు పిల్లంగోళ్ల శ్రీదేవి హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సంక్షేమ బోర్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక సమతుల్యానికి బాటలు వేస్తూ పేదలను సైతం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని వివరించారు. రాబోయే 2024 ఎన్నికల్లో మీరంతా జగనన్నకు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో మహిళా ఉపాధ్యక్షురాలు రాధ, మంగమ్మ, పార్టీ నాయకులు దేవరకొండ నాగేశ్వరరావు, లంకలపల్లి గణేష్, గంపా నాగు, నేతల కోటి తదితరులున్నారు.

పథకాలు అందుతున్నాయి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ అర్హులకు పథకాలను అందజేస్తున్నారు. నాకు కాపునేస్తం పథకంలో లబ్ధి చేకూరింది. మా ఇంట్లో పెద్దలకు పెన్షన్ కూడా ప్రతి నెలా 1వ తేదీనే అందిస్తున్నారు. పథకాల అమలు పట్ల సంతృప్తిగా ఉంది.

– రమాదేవి, ఏలూరు వన్‌టౌన్


పేదలకు మంచి చేస్తున్న జగన్



కుటుంబంలోని వ్యక్తులే పట్టించుకోని పరిస్థితుల్లో ప్రతి నెలా 1వ తేదిన పెన్షన్ ఇంటి వద్దకే ఇవ్వడం అభినందనీయం. మేము ఉన్నంత కాలం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి అండగా ఉంటాం. పేదలందరికీ మంచి జరుగుతుంది.

– గొరివర్తి సత్యనారాయణమ్మ, ఏలూరు వన్‌టౌన్

ఘనంగా ఐసీఎం చర్చ్ వార్షికోత్సవం



వాక్య బోధన చేస్తున్న బిషప్ జాన్ ఎస్‌డీ రాజు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అల్లూరి సీతారామరాజు స్టేడియం ఎదురుగా ఉన్న ఆల్ సెయింట్స్ ఐసీఎం చర్చ్ కథెడ్రల్ తొమ్మిదో వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. 100 సంవత్సరాల పూర్వం నిర్మించిన ఈ చర్చ్‌ని 2014వ సంవత్సరంలో పునర్నిర్మించి, ప్రారంభించినట్లు ఐసీఎం సంఘాల అగ్రపీఠాధిపతులు బిషప్ జాన్ ఎస్‌డీ రాజు తెలిపారు. కృష్ణ, పశ్చిమ గోదావరి జిల్లాల ఐసీఎం సంఘాల నుంచి అనేక మంది భక్తులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బిషప్ జాన్ పరిశుద్ధ యుకరిస్తూ ఆరాధన నిర్వహించి, వాక్య బోధన చేశారు. ఈ సందర్భంగా 2024 సంవత్సరపు క్యాలండర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ఐసీఎం సంఘాల సెక్రటరీ ఎన్‌వైవీ ప్రసాద్, కోశాధికారి యేసు రత్నం, ట్రస్ట్ బోర్డు సభ్యులు టి.ఆశయ్య, ఆర్ రవి కుమార్, సీహెచ్ జాకబ్ రాజు, జాన్ లియో, పాస్టర్ల కౌన్సిల్ సెక్రటరీ రత్నాకర్ రావు, కరెస్పాండెంట్లు రోజీ జాన్, ఆర్ డేవిడ్, డీసరీ చైర్మన్లు, సంఘకాపరులు, టీచర్లు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

మార్మోగిన శివనామస్మరణ



పత్తేబాద చౌడేశ్వరి రామలింగేశ్వర స్వామి



పవర్‌పేట విశ్వేశ్వర స్వామి



కొత్తపేట అవిముక్తేశ్వర స్వామి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కార్తీక మాసం ఆఖరి సోమవారం పర్వదినం సందర్భంగా నగరం శివనామస్మరణతో మార్మోగింది. తెల్లవారుజామున నుంచి భక్తులు ఆయా శివాలయాలకు చేరుకుని ధ్వజ స్తంభాల వద్ద కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. పలు శైవక్షేత్రాల్లో విశేష పూజలు చేశారు. పత్తేబాద చౌడేశ్వరి రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో మహన్యాస పూర్వక అభిషేకాలు నిర్వహించి తీర్థ ప్రసాద వినియోగం చేశారు. సాయంత్రం ఆకాశదీప పూజ చేసి స్వామి వారికి విశేష అలంకరణ చేశారు. అర్చకులు కొడమంచిలి లక్ష్మణరావు విశేష పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారి డి.శంకరరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు. పవర్‌పేట కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో మాసశివరాత్రి తెల్లవారుజాము నుంచి భక్తుల గోత్రనామాలతో స్వామి వారికి రుద్రాభిషేకం చేశారు. అన్నపూర్ణమ్మవారికి కుంకుమ పూజ నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి విశేష అలంకరణ చేసి, ఆకాశదీప పూజ నిర్వహించి విశేష హారతి సేవ చేశారు. రాత్రి శ్రీగంగా, కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి వార్ల శాంతి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అర్చకులు కందుకూరి రామబ్రహ్మానంద శర్మ ప్రత్యేక పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారి ఎం.రామాంజనేయులు కార్యక్రమాలను పర్యవేక్షించారు. దొండపాడు శ్రీ నం దత్తనాథ క్షేత్రంలో సర్వదోష పరిహారక విశ్వేశ్వర స్వామి వారికి ఉదయం విశేష అభిషేకం, మహన్యాస పారాయణ, లఘున్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకాలు చేసి విశేష అలంకరణ, అర్చన నిర్వహించారు. సాయంత్రం ప్రదోషకాల అర్చన, అభిషేకం, జ్యోతిర్లింగార్చన, విశేష పుష్పార్చన నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వినియోగం చేశారు. క్షేత్రం అర్చకులు ఘంటసాల రామకృష్ణ విశేష పూజలు చేయగా, వ్యవస్థాపక ట్రస్టీ వేణు గోపాల్ లునాని, కార్యదర్శి కాకి బాబు కార్యక్రమాలు పర్యవేక్షించారు. శనివారపుపేట శివాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కొత్తపేటలో అవిముక్తేశ్వర స్వామి ఆలయంలో విశేష పూజలు, ప్రత్యేక రుద్రాభిషేకాలు నిర్వహించారు. స్వామి వారికి విశేష అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వినియోగం చేశారు.

కార్పొరేషన్‌కు హైడ్రాలిక్ ల్యాడర్ ప్రారంభం

ఏలూరు టౌన్: ఏలూరు నగర పాలక సంస్థ హైడ్రాలిక్ ల్యాడర్ వాహనాన్ని కార్పొరేషన్ కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు సోమవారం సాయంత్రం ప్రారంభించారు. ఏలూరు నగరపాలక సంస్థలో పాటు విలీనమైన ఏలూరు పంచాయితీల్లో 1758 వీధిలైట్లు ఉన్నాయని, వీధిలైట్ల సమస్యలను పరిష్కరించేందుకు హైడ్రాలిక్ ల్యాడర్ వాహనం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. ఏడు పంచాయతీల్లో తొమ్మిది వేల వీధిలైట్లు ఉండటంతోపాటు వీధిలైట్ల సమస్య వచ్చినప్పుడు వాటిని పరిష్కరించడంలో ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆదేశాల మేరకు ఈ వాహనాన్ని కొనుగోలు చేశామన్నారు. రూ.26 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన హైడ్రాలిక్ ల్యాడర్ చిన్నచిన్న వీధుల్లోకి సైతం వెళ్లి వీధిలైట్ల మరమ్మతులకు అనుకూలంగా ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం వన్‌టౌన్ ప్రాంతానికి ఒకటి, టూటౌన్ ప్రాంతానికి ఒక హైడ్రాలిక్ ల్యాడర్ వాహనం ఉపయోగించేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. కార్యక్రమంలో నగర కమిషనర్ సంక్రాంతి వెంకట కృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ బాపిరాజు, ఎస్ఈ వెంకటేశ్వరరావు, కార్పొరేటర్లు దేవరకొండ శ్రీనివాసరావు, పార్టీ నాయకులు నున్నా కిషోర్, పాము సామ్యూల్, జనపరెడ్డి కృష్ణ, డీఈ తాతబాబు, ఏఈ సాయి, ఎలక్ట్రికల్ ఏఈ గిరి ఉన్నారు.



హైడ్రాలిక్ ల్యాడర్‌ను ప్రారంభిస్తున్న కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు

'ఆపదలో అండగా ఉంటా'

పెదవేగి : ఆపదలో ఉన్న ప్రతిఒక్కరికీ అండగా నిలుస్తానని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. వివిధ రకాల సమస్యలతో బాధపడుతున్న వారి కుటుంబాలను ఆయా గ్రామాల నాయకులతో కలిసి ఎమ్మెల్యే సోమవారం పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న పెదవేగి మండలం కూచింపూడికి చెందిన దేవరపల్లి చిన్నబాబుని పరామర్శించిన ఎమ్మెల్యే, ఆర్థిక సాయాన్ని అందజేశారు. పెదవేగిమండలం ముండూరుకి చెందిన గెడ్డం మరియమ్మ ఇటీవల మరణించగా ఆమె ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి బాధిత కుటుంబానికి అబ్బయ్యచౌదరి ఆర్థిక సహాయం అందజేశారు. పెదవేగి మండలం ముండూరుకి చెందిన పోలేపల్లి రాజేశ్వరి ఇటీవల మరణించగా వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆయన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



కూచింపూడిలో చిన్నబాబుకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

జగనన్న ప్రభుత్వం ఉద్యోగాల భర్తీలో సరికొత్త రికార్డు

దెందులూరు: రాష్ట్ర చరిత్రలో జగనన్న ప్రభుత్వం ఉద్యోగాల భర్తీలో సరికొత్త రికార్డు సృష్టించిందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. సోమవారం దెందులూరు ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలోనే 6.32లక్షల ఉద్యోగాలు భర్తీ చేసిందన్నారు. ఇప్పుడు తాజాగా గ్రూప్- 1, 2 నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో ఇచ్చిన ఉద్యోగాల్లో కేవలం 34వేలు మాత్రమేనన్నారు. గొప్ప నాయకుడిగా జగనన్న చరిత్రలో నిలుస్తారని ఎమ్మెల్యే అన్నారు.

ఆత్మవిశ్వాసంతో లక్ష్యాన్ని సాధించాలి

పెదవేగి : దివ్యాంగుల జీవితాలకు భరోసా కల్పించే విధంగా ప్రభుత్వం అమలు చేసే పథకాలను సద్వినియోగం చేసుకొని ఆత్మవిశ్వాసంతో లక్ష్యాన్ని సాధించాలని ఎంఈఓ సీహెచ్ బుద్దవాస్ అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా పెదవేగి ఎంపీపీ మెయిన్ స్కూల్ భవిత కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బుధవాస్ మాట్లాడు తూ దివ్యాంగులందరికీ ప్రభుత్వం విద్య, వైద్య ఉపాధికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పెదవే గి మెయిన్ స్కూల్ హెచ్ఎం టి. మాధవి వాటర్ బాటిళ్లు, ఎంపీపీ ఎస్ జగన్నాథపురం టీచర్ టి. మమతా టిఫిన్ బాక్సులు, మహాలక్ష్మి ప్లైవుడ్ ఇండస్ట్రీస్ వారు పి కన్నబాబు క్రీడా సామగ్రి, డ్రాయింగ్ బుక్స్ అందజేశారు. ఎంపీపీ ఎస్ జోగన్నపాలెం హెచ్ఎం సునీత టీచర్ దివ్యాంగులకు మిఠాయిలు అందజేశారు. ఉపాధ్యాయులు కె.మల్లేశ్వరి, టి.మాధ వి, టి మమత, ఐఈ ఆర్‌టీలు ఎం విజయలక్ష్మి, కె సోమరాజు, దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు బహుమతుల ప్రదానం చేస్తున్న ఎంఈఓ బుద్దవాస్, ఉపాధ్యాయులు

క్రిస్మస్ ఆరాధన పండుగలు ప్రారంభం



ఇండోర్ స్టేడియం ప్రాంగణంలో క్రిస్టమస్ ఆరాధన పండుగల్లో పాల్గొన్న విశ్వాసులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక మన్నా చర్చ్ ఆధ్వర్యంలో సోమవారం క్రిస్మస్ ఆరాధన పండగలు వైభవంగా ప్రారంభమయ్యాయి. సోమవారం స్థానిక ఇండోర్ స్టేడియం ప్రాంగణంలో ప్రారంభమైన ఈ ఆరాధనల్లో పాస్టర్ ఎం.జ్యోతిరాజు వాక్య సందేశమిచ్చారు. బిషప్ ఎలీషా రాజు క్రిస్మస్ విశిష్టతను, ఏసుప్రభువు అనుసరించిన మార్గాన్ని విశ్వాసులకు వివరించారు. మన్నాచర్చ్ యూత్ ఏసుక్రీస్తు నాటికలు ప్రదర్శించారు. మన్నా చర్చ్ కవయిర్ ఆధ్వర్యంలో ఆలపించిన భక్తి గీతాలు విశ్వాసులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా క్యాండిల్ లైట్ సర్వీస్ చేశారు.

'ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్' ప్రారంభం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) సహకారంతో ఏర్పాటుచేసిన ఆరు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, డిజైన్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ (కర్నూలు)కు చెందిన ప్రొఫెసర్ ముప్పలనేని నరేష్ బాబు ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. కళాశాల కరస్పాండెంట్ జాస్తి మల్లికార్జునుడు, ప్రిన్సిపాల్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తాము ఇటువంటి కార్యక్రమాలతో ఫ్యాకల్టీ డెవలప్మెంట్ కోసం నిత్యం కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమానికి వివిధ కళాశాలల నుంచి 45 మంది అధ్యాపకులు పాల్గొన్నట్టు కార్యక్రమ సమన్వయ కర్త ఆదిమూలం యేసుబాబు తెలిపారు. కార్యక్రమంలో సీఆర్ రెడ్డి విద్యా సంస్థల సెక్రటరీ కిలారు ప్రభాకరరావు, డిసిగ్నేటెడ్ ప్రతినిధి కొండా హరిరామ కృష్ణం రాజు పాల్గొన్నారు.

సీఎం జగనన్నకు మెండుగా ప్రజల ఆశీస్సులు

పెదపాడు: ప్రజల ఆశీర్వాదం మెండుగా ఉన్న వైఎస్ జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రిగా అధికారం చేపడతారని ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్ తెలిపారు. పెదపాడు మండలంలోని వీరమ్మకుంట గ్రామ సచివాలయం వద్ద పల్లె పిలుస్తోంది, వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయం పరిధిలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను తెలిపే సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. అనంతరం ప్రజలనుద్దేశించి పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి, బీసీ సెల్ అధ్యక్షుడు, నర్సాపురం నియోజకవర్గ పరిశీలకుడు ఘంటా ప్రసాదరావు మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలను అమలు చేసి కుటుంబాలను బలోపేతం చేసిన ముఖ్యమంత్రి జగన్ పాలనను గుర్తుపెట్టుకోవాలని సూచించారు. వైఎస్సార్ సీపీకి ఘన విజయం అందించాలని కోరారు. తొలుత పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రజా సంక్షేమ పాలన అందించేందుకు ప్రతి ఒక్కరూ కంకణ బద్ధులై ఉండాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సర్పంచ్ మరడాన చంటిబాబు, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ అక్కినేనిగోపీ చంద్ర దుర్గాప్రసాద్ ప్రజల నుద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పూడి అప్పలస్వామి విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు కత్తుల రవికుమార్, స్థానిక నాయకులు దాసరి పెదబాబు, గుణుపూరు మహేష్, పూడి రంగప్పారావు, బత్తుల ఏసురాజు పాల్గొన్నారు.



పెదపాడు: వీరమ్మకుంటలో సంక్షేమ బోర్డును ఆవిష్కరించిన వైఎస్సార్ సీపీ నాయకులు

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	34
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.15	6
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	42
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	32

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	28
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	32
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	32
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4822	29
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	35
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	25
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -తిరుపతి	16.00	4830	33

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	30	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	64	చిక్కుడు కాయలు	68
వంకాయలు (కాంతులు)	68	చామదుంపలు	56
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	07-10
బెండకాయలు	56	కంద	70
పచ్చిమిర్చి	28	బీట్‌రూట్	48
కాకర కాయలు	32-40	కీరా దోస	40
బీరకాయలు	48	ఫ్రెంచ్‌బీన్స్	80
బీరకాయలు (పందిరి)	70	అల్లం	120
క్యాబేజీ	20-25	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	56	పాలకూర	12
దొండకాయలు	44	చుక్కకూర	12
బంగాళదుంపలు	26	తోటకూర	12
ఉల్లిపాయలు	45-55	గోంగూర	07
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	32	బఠాణీ	--
ఆనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20-25	చిలకదదుంప	32